నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 10 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


సత్యదేవుని ఆశీస్సులు తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



సంచులు ఆవిష్కరిస్తున్న మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ రాహుల్, డీఈవో యాదయ్య తదితరులు

# గూడెం ఆయకట్టు సుభిక్షంగా ఉండాలి

- కేసీఆర్ సర్కారుతోనే రైతులకు న్యాయం
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దండేపల్లి, జనవరి 9: శ్రీ సత్యనారాయణ స్వామి ఆశీస్సులతో గూడెం ఆయకట్టు ప్రాంతం సుభిక్షంగా ఉండాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామిని స్థానిక నాయకులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు దివాకర్‌రావును సన్మానించి, శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ సింహద్వారం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండోపంటకు నీరందే విషయంలో ఎత్తిపోతల పథకంలో ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. 42వ డిస్ట్రిబ్యూటరీ వరకు నీరందాలని, సమృద్ధిగా పంటలు పండి నియోజకవర్గ రైతులు సంతోషంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశామని అన్నారు. ఆనాడు కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన ఎల్లంపెల్లి ప్రాజెక్టు, గూడెం ఎత్తిపోతలతో 30 వేల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలంగా మారినట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకంలో తరుచూ తలెత్తుతున్న ఇబ్బందులకు అడ్డుకట్ట వేసేందుకు గతేడాది కేసీఆర్ చొరవతో ఇంతకుముందు ఉన్న జీఆర్(గ్లాస్ రీఎన్‌ఫోర్స్‌డ్) పైపులు తొలగించి రూ.20కోట్లతో మైల్డ్ స్టీలు(ఎంఎస్)పైపులు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. రైతులకు సాగు నీరు అందించేందుకు ఇబ్బంది కాకుండా వేసవిలో 2.7కిలో మీటర్ల పైపులైన్ పనులు ప్రారంభించి పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, లక్షెట్టిపేట, దండేపల్లి బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు చుంచు శ్రీనివాస్, చుంచు చిన్నయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అక్కల రవి, బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పాదం శ్రీనివాస్, మందపెల్లి శ్రీనివాస్, బండారి మల్లేశ్, బండారి వెంకటేశ్, సురేందర్, ముద్దసాని తిరుపతి, గొల్లపెల్లి అజయ్, ముచ్చర్ల తిరుపతి, మగ్గిడి శ్రీనివాస్, రాజయ్య, దమ్మ సునీల్, రాజశేఖర్, తదితరులు ఉన్నారు.


గురుకులాల్లో ప్రవేశాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 9: జిల్లాలోని గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న గురుకుల విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురుకులాల ప్రిన్సిపాళ్లు సురేశ్, అనితతో కలిసి టీజీ సెట్ ప్రవేశ పరీక్ష ఫ్లెక్సీని మగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ గిరిజన గురుకులాల ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు ఓంకార్ కృష్ణ, సత్యనారాయణ, మాన్కు, ఆనంద్ రావు, వెంకటేశ్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

# వ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టండి

**కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్**

కాగజ్‌నగర్, జనవరి 9: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టి, నిత్యం వ్యాయామం చేయాలని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. కాగజ్‌నగర్‌లోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు, పోలీస్ కుటుంబాలకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా సేవలందిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో టీవీ, మొబైల్ అధికంగా వాడడంతో కంటి సమస్యలు అధికమవుతున్నాయని చెప్పారు. త్వరలో ఆసిఫాబాద్‌లో కూడా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, పట్టణ సీఐ స్వామి, రూరల్ సీఐ నాగరాజు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ అశోక్, కో ఆర్డినేటర్ మహేందర్, ఎస్‌ఐలు అంజయ్య, శ్రీకాంత్, రమన్ కుమార్, సోనియా, సిబ్బంది పాల్గొన్నారు.


టాస్క్ శిక్షణ తరగతులకు హాజరైన డీఈవో అశోక్

# టాస్క్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం

**కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో అశోక్**

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 9: టాస్క్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చునని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో అశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో జిల్లా ఎగ్జామినేషన్ అధికారి ఉదయ బాబుతో కలిసి బేసిక్ ఐటీ స్కిల్, సాఫ్ట్ స్కిల్ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాస్క్‌లో కంప్యూటర్ సంబంధిత శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ టాస్క్ సేవలు సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ రంగంలో రాణించాలని సూచించారు. టాస్క్ రీజినల్ సెంటర్ మేనేజర్ సాయి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

# ఉత్తమ బోధన.. భవితకు నిచ్చెన..

**ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం**

- జనవరి 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు స్వీకరణ
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష

మంచిర్యాల అర్బన్, జనవరి 9: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూల్స్) ముందుంటున్నాయి. ఆంగ్ల మాధ్యమంలో కార్పొరేటు స్థాయి విద్య అందించడమే కాకుండా అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తుండడం, ఉచితంగా ఉత్తమ విద్య అందుతుండడంతో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఆరో తరగతిలో ప్రవేశాలు, ఏడు నుంచి పదో తరగతి వరకు ఆయా పాఠశాలల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది.

## ఉత్తమ బోధనతోనే పోటీ..

అన్ని వసతులతో కూడిన పక్కా భవనాలు, ఆటల్లో ముందంజ, సాంస్కృతిక కార్యక్రమాల్లో నైపుణ్యం, పూర్తి స్థాయి సిబ్బంది, సీసీ కెమెరాల నిఘాలో ఆదర్శ పాఠశాలలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. అన్ని చోట్ల వృత్తి విద్యా కోర్సుల్లోనూ శిక్షణనిస్తున్నారు. యానిమేషన్, బ్యూటీషియన్, మైక్రో ఇరిగేషన్, మీడియా అండ్ ఎంటర్టైన్‌మెంట్,హెల్త్‌కేర్, వెల్‌నెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, బ్యాంకింగ్ వంటి పలు రకాల కోర్సులను ఎంపిక చేసుకునేలా అవకాశం కల్పిస్తున్నారు. ఏటా అధిక సం ఖ్యలో విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీంతో ప్రతి ఏడాది పదో తరగతిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణతతోపాటు, మెరుగైన జీపీఏ సాధిస్తున్నారు.

## ఐదు మోడల్ స్కూళ్లలో..

మంచిర్యాల జిల్లాలో ఐదు మోడల్ పాఠశాలలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో ఉన్న మోడల్ స్కూళ్లతో పాటు దండేపల్లి మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్, మందమర్రి, కాసిపేట, కోటపల్లి మండల కేంద్రాల్లోని ఆదర్శ పాఠశాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.



మంచిర్యాలలోని మోడల్ స్కూల్

## ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్ష...

ఈ నెల 12వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆరో తరగతిలో చేరే విద్యార్థులకు ఏప్రిల్ ఏడో తేదీన ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు, ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఓసీ విద్యార్థులు రూ. 150, దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 75 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి దరఖాస్తులు వెబ్‌సైట్ (www.telanganams.cgg.gov.in) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆదర్శ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో ఆరో తరగతి, పై తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి 22వ తేదీ వరకు గడువు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి దరఖాస్తులు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. మోడల్ స్కూళ్లలో మధ్యాహ్న భోజనంతోపాటు, ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నాం. ఏటా మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ అవకాశాన్ని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

*- యాదయ్య, డీఈవో, మంచిర్యాల*


మంచిర్యాలలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న మున్సిపల్ జేడీ నారాయణ రావు


జైనూర్ ఎంపీడీవో కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి

# దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

మంచిర్యాలటౌన్, జనవరి 9: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం మంచిర్యాల అదనపు కలెక్టర్ బీరాహుల్, సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్, ప్రజాపాలన కార్యక్రమం ఆదిలాబాద్ రీజయన్ ప్రత్యేకాధికారి నారాయణరావు పరిశీలించారు. వీరిరువురు వేర్వేరుగా మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రక్రియ జరుగుతున్న తీరను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలను సిస్టం ఆపరేటర్లను అడిగారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా, నిర్ణీత గడువులోగా దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల కమిషనర్లు మారుతీప్రసాద్, వెంకట నారాయణ, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జైనూర్ జనవరి 9: జైనూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను కుమ్రం భీం ఆసిఫాబాద్ అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి మంగళవారం పరిశీలించారు. మండలంలో 9403 అప్లికేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో ప్రభుదయా తెలిపారు. తహసీల్దార్ తిరుపతి, ఆర్ఐ వాగ్మారే సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# బాలలతో పనిచేయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్


మంచిర్యాలలో ప్రభుత్వ దవాఖాన నిర్మాణ పనులను పరిశీలిస్తూ..

నస్పూర్, జనవరి 9: బాలలతో పని చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్త్రీ శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ -10, భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, బాలల పరిరక్షణ సమితి చైర్మన్ వాహిద్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంక్షేమం, రక్షణ, పునరావాసంపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆపరేషన్ స్మైల్ 10లో భాగంగా ఈ నెల 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతామన్నారు. బాలకార్మికులుగా ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, బాలల పరిరక్షణ కేంద్రాల్లో అప్పగించాలని తెలిపారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంపై కూడా విస్తృత ప్రచారం చేయాలని సూచించా రు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికా రి నీరటి రాజేశ్వరి, బాలల సంరక్షణ అధికారి ఆనంద్, జిల్లా వెనుకబడిన అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

.. మరిన్ని జిల్లా వార్తలు 8లో

## ఇసుక అక్రమ రవాణాపై నిఘా

ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి పోలీసులు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహన యజమానులకు రెండు సార్లు జరిమానా విధించాలని, అయినప్పటికీ రవాణా కొనసాగిస్తే కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న కాలేజీ రోడ్డు, పాత మంచిర్యాల, ముల్కల్ల ప్రాంతాలను పరిశీలించారు. గనుల శాఖ అధికారి బాలు, గ్రామీణ నీటి పారుదల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, మోహన్, తహసీల్దార్లు ప్రతాప్, శశికుమార్, భూగర్భ జల శాఖ అధికారి గణేశ్, అధికారులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లాలో రైసుమిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాలను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వానకాలం 45 వేల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సంబంధిత సీఎంఆర్ పంపించాల్సి ఉందని తెలిపారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్మాసు కాంతయ్య, అధికారులు పాల్గొన్నారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాల ఏసీసీ, జనవరి 9: జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో చేపట్టిన మాతా శిశు దవాఖాన, హాజీపూర్ మండలం గుడిపేటలో కొనసాగుతున్న వైద్య కళాశాల భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం ఆయా చోట్ల పనులను రోడ్డు-భవనాల శాఖ ఏఈ అనూషతో కలిసి పరిశీలించారు. పనులను నిత్యం అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ రెండు నిర్మాణాలను రూ. 510 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. వైద్య కళాశాల భవన సముదాయం నిర్మాణ పనులను అక్టోబర్‌లోగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సుస్థిర జీవన విధానంతోనే పర్యావరణ రక్షణ

**మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ రాహుల్**

మంచిర్యాల అర్బన్, జనవరి 9 : సుస్థిర జీవన విధానంతోనే పర్యావరణానికి రక్షణ ఉంటుందని మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ బీ రాహుల్ అన్నారు. మంచిర్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల పర్యావరణ క్లబ్బుల ఉపాధ్యాయులు, విద్యార్థులకు 'సుస్థిర జీవన విధానం - పర్యావరణం' అంశంపై జరిగిన ఒక రోజు జిల్లా స్థాయి వర్క్‌షాపునకు హాజరై ఆయన మాట్లాడారు. బాల్యం నుంచే పర్యావరణ మిత్ర అలవాట్లు పెంపొందించుకోవాలని, బడులను, వీధులను శుభ్రంగా ఉంచుకుంటేనే స్వచ్ఛ మంచిర్యాల జిల్లా సాధ్యమవుతుందన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ యోగేశ్వర్, రాష్ట్ర ప్రాజెక్టుల అధికారులు విద్యాసాగర్, రాష్ట్ర అధికారులు మేజర్ శివకిరణ్, వెంకటేశ్వర్లు వ్యర్థాల నిర్వహణ, కంపోస్టింగ్ విధానం, సింగిల్ ప్లాస్టిక్ నివారణ, జీవ వైవిధ్య రక్షణపై వర్క్‌షాపు నిర్వహించి శిక్షణ ఇచ్చారు. అనంతరం కేంద్రం సరఫరా చేసిన బట్ట సంచులు, పుస్తకాలను డీఈవో యాదయ్యతో కలిసి ఆవిష్కరించారు. పారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన 'ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం' ఎంతగానో ఆకట్టుకుంది. ఎన్డీసీ డైరెక్టర్ సంతోష్ ప్రదర్శించిన మ్యాజిక్ షో ఉత్తేజాన్ని నింపింది. జిల్లాలో ఎంపిక చేసిన 50 పాఠశాలల గ్రీన్ టీచర్స్, 150 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 9: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చుల పరిమితికి లోబడి ఉండాలని సూచించారు. చేసిన ప్రతి ఖర్చునూ నమోదు చేసి పూర్తి వివరాలను సమర్పించాలని కోరారు. సభలు, సమావేశాలు, ప్రకటనలు , తదితర పూర్తి వివరాలను అందించాల్సి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక దృష్టి పెట్టాలి..

జిల్లాలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో పాటు జిల్లా సంక్షేమ శాఖ, విద్య, వైద్య, గిరిజనాభివృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన, పోలీసు శాఖల అధికారులు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. భ్రూణహత్యలు నివారించి, ఆడపిల్లలను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జనాభా లింగ నిష్పత్తిలో ఆడపిల్లల శాతం పెరిగేలా కృషి చేయాలని, ఆ దిశగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లుల తనిఖీ

మంచిర్యాల అర్బన్, జనవరి 9: జిల్లాలో సీఎంఆర్ పెండింగ్ ఉన్న పలు మిల్లులను మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు మంగళ వారం జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ, సీఎంఆర్ పెట్టిన వివరాలు, బకాయి ఎంత ఉందో రికార్డులను పరిశీలించారు. అలాగే ధాన్యం నాణ్యతను పరిశీలించారు. ఈ నెలాఖరులోగా బకాయి ఉన్న సీఎంఆర్ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వాజీద్ ఆలీ, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గెడం గోపాల్, రజిత తదితరులున్నారు.

# లారీ, స్కూల్ బస్సు ఢీ

- రాంగ్ రూట్‌లో వెళ్తున్న ప్రైవేట్ పాఠశాల బస్సు
- డ్రైవర్, నలుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు
- మరో పదకొండు మంది స్వల్పగాయాలు

రెబ్బెన, జనవరి 9: మండలంలోని ఇందిరానగర్ గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం సాయంత్రం లారీ..స్కూల్ బస్ ఢీ కొన్నాయి. రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అన్నపూర్ణ హైస్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులను తీసుకొని రెబ్బెన వైపు నుంచి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు వెళ్తున్నది. చంద్రపూర్ నుంచి కర్ణాటకకు వెళ్తున్న లారీ, ఇందిరానగర్ వద్ద విద్యార్థులను దించి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు రాంగ్‌రూట్ లో వస్తున్న స్కూల్ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ సుధాకర్ సహా 15 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. క్యాబిన్ లో ఇరుక్కొని తీవ్రంగా గాయపడిన సుధాకర్ ను వైద్యం కోసం మంచిర్యాల దవాఖానకు తరలించారు. తీవ్రంగా గాయపడిన విజయలక్ష్మి, అంకిత, రాంచరణ్, నిఖిల్, స్వల్పంగా గాయపడిన ధనుష్, అన్విత్, అభినవ్, అశ్విత్, దేవిక శ్రీ, అద్య శ్రీ, రవిచంద్ర, అక్షిత, ధనుశ్, శ్రావ్యలను 108లో కాగజ్‌నగర్ దవాఖానకు తరలించారు. వరుణ్‌చంద్రను బైక్‌పై కాగజ్‌నగర్‌కు తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ తిరుపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు